అగ్ర నటుడు చిరంజీవికి కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ్ పురస్కారం ప్రకటించిన సందర్భంగా తెలంగాణ ఫిలిం ఛాంబర్ శనివారం ఆయనను కలిసి అభినందనలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో ఛాంబర్ చైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్, వైస్ చైర్మన్ గురురాజ్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాను దేవాలయంగా భావిస్తున్నారు

వరలక్ష్మి శరత్‌కుమార్, తేజ సజ్జా, అమృత అయ్యర్, ప్రశాంత్‌వర్మ, నిరంజన్ రెడ్డి

ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో ఆయన సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన ఫస్ట్ ఇండియన్ ఒరిజినల్ సూపర్ హీరో చిత్రం 'హనుమాన్'. తేజ సజ్జా హీరోగా ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కే నిరంజన్‌రెడ్డి నిర్మించారు. సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రానికి చక్కటి ఆదరణ లభిస్తున్నది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ శనివారం గ్రాటిట్యూడ్ మీట్ నిర్వహించింది. దర్శకుడు ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ.. నిరంజన్ గారి లాంటి నిర్మాత దొరకడం మా అదృష్టం. 'హను-మాన్' విజయం ప్రేక్షకులదే. ఎన్నో క్లోజింగ్ థియేటర్స్ ఈ సినిమాతో ఓపెన్ కావడం ఆనందాన్నిచ్చింది. మూడో వారంలోనూ హౌస్‌ఫుల్ బోర్డు చూడటం మేకర్స్‌కి గొప్ప తృప్తినిస్తుంది. ఈ సినిమా ఇంకా చాలా రోజులు ఆడుతుంది. 'హను-మాన్'కు చాలా వేడుకలు చేయనున్నాం. ఈ సినిమాకు పనిచేసినవాళ్లందరికీ గిఫ్ట్స్ ఉండబోతున్నాయి. ప్రేక్షకులు 'హను-మాన్' సినిమాను చూస్తూ థియేటర్లను దేవాలయాలుగా భావిస్తున్నారు. సినిమా చూస్తున్న ప్రతి ఒక్కరూ అయోధ్య ఆలయానికి ఐదు రూపాయలు విరాళం చేస్తున్నారు. ఈ సినిమా లాభాలను దేవుళ్లకు, సినిమాలు తీయడానికే ఖర్చు పెడతాం. ఈ చిత్ర సీక్వెల్ 'జై హనుమాన్'తో అందరి రుణం తీర్చుకోబోతున్నాను. 'హను-మాన్' కన్నా 'జై హనుమాన్' వంద రెట్లు గొప్పగా ఉంటుంది. ఇంటర్నేషనల్ సినిమా చేయడానికి ప్రయత్నిస్తున్నాం' అన్నారు. హీరో తేజ మాట్లాడుతూ 'సినిమాను ఆదరించిన ప్రేక్షకులకు పాదాభివందనం' అని అన్నారు.

కథలో సహజత్వం ఉంటుంది

'దొరసాని', 'ఏబీసీడీ', 'ఊర్వశివో రాక్షసివో', 'బేబి' వంటి చిత్రాలతో టాలీవుడ్‌లో తన కంటూ పేరు తెచ్చుకున్నారు నిర్మాత ధీరజ్ మొగిలినేని. సుహాస్ హీరోగా ఆయన నిర్మిస్తున్న చిత్రం 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. జీఏ2 పిక్చర్స్, మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై తెరకెక్కుతోంది. దుశ్యంత్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ఫిబ్రవరి 2న థియేటర్ల ద్వారా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్మాత ధీరజ్ చిత్ర విశేషాలను పాత్రికేయులతో పంచుకున్నారు. 'లాక్‌డౌన్ తర్వాత దుశ్యంత్ 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' కథను డైలాగ్ వెర్షన్‌తో చెప్పారు. కథలోని ఎలిమెంట్స్ సహజంగా ఉండి నన్ను ఆకట్టుకున్నాయి. కథలోని సహజత్వం కాస్టింగ్, లొకేషన్స్‌లోనూ ఉండేలా ప్లాన్ చేసుకున్నాం. ఊరిలో జరిగే కథ కాబట్టి కుల ప్రస్తావన ఉంటుంది. ఏ కులాన్నీ కించపర్చేలా చూపించడంలేదు. ఏదో సందేశం ఇవ్వాలని కాకుండా ఒక ప్రాంతంలో జరిగిన వాస్తవ సంఘటనల్ని తెరకెక్కించాం అంతే! సుహాస్‌ను సీరియస్ సబ్జెక్ట్‌లో చూపించాలనే ప్రధాన పాత్ర కోసం ఆయన్ను తీసుకున్నాం. కమర్షియల్ ఫీల్ రావొద్దని భావించి పేరున్న హీరోయిన్లను తీసుకోలేదు. కథానాయిక ఫ్రెండ్ రోల్ కోసం ఆడిషన్స్ కోసం వచ్చిన శివానిని హీరోయిన్‌గా ఓకే చేశాం. గీతా ఆర్ట్స్ గుడ్‌విల్ కాపాడుతూనే కొత్తవాళ్లతో సినిమా చేశాం. అల్లు అరవింద్ గారు సినిమా చూసి సంతోషంతో మమ్మల్ని హగ్ చేసుకున్నారు. చిన్న కరెక్షన్ కూడా చెప్పలేదు. బాగా నచ్చడంతో రెండోసారీ చూశారు. ప్రస్తుతం రష్మిక మందన్నతో 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా చేస్తున్నాం. 40 శాతం షూటింగ్ పూర్తయింది. మరో మూడు ప్రాజెక్టులూ రెడీ చేసుకుంటున్నాం. వివరాలు త్వరలో వెల్లడిస్తాం' అని వివరించారు.



ధీరజ్ మొగిలినేని

శృతిహాసన్

సమరయోధురాలి పాత్రలో..

అగ్ర కథానాయిక శృతిహాసన్ పట్టిందల్లా బంగారమవుతున్నది. ఈ భామ నటించిన సినిమాలన్నీ విజయం సాధిస్తుండటంతో అదృష్ట నాయిక అంటూ అభిమానులు సంబరపడిపోతున్నారు. గత ఏడాది తెలుగులో వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, సలార్, హాయ్ నాన్న సినిమాలు ఈ అమ్మడికి మంచి విజయాలను అందించాయి. ఈ నేపథ్యంలో కథల ఎంపికలో మరింత వైవిధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించుకుందట శృతిహాసన్. తాజా సమాచారం ప్రకారం తమిళంలో 'వేలు నాచ్చియార్' అనే వీర వనిత పాత్రలో నటించబోతున్నదట. స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న ధీర వనితగా తమిళనాట వేలు నాచ్చియార్ ప్రసిద్ధికెక్కింది. కథలోని దేశభక్తి అంశాలు, తన పాత్రలోని ధీరత్వం నచ్చడంతో ఈ సినిమాకు శృతిహాసన్ ఓకే చెప్పిందని తమిళ సినీ వర్గాల్లో వినిపిస్తున్నది. ఇప్పటివరకు ఎక్కువగా గ్లామర్ రోల్స్‌లోనే కనిపించిన ఈ అమ్మడు తొలిసారి స్వాతంత్ర్య పోరాట నేపథ్య కథలో నటిస్తుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. దాదాపు నాలుగేళ్ల విరామం తర్వాత మాతృభాష తమిళంలో శృతిహాసన్ నటించబోతున్న చిత్రమిదే కావడం విశేషం.

అతి భయంకరుడు ఉధిరన్

స్టార్ హీరో సూర్య నటిస్తున్న 'కంగువ'లోని ఉధిరన్ ఎంత భయంకరంగా ఉంటాడో తెలిసిపోయింది. ఈ సినిమాను స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ పతాకాలపై నిర్మిస్తున్నారు. దిశా పటానీ హీరోయిన్. చారిత్రక నేపథ్యంలో దర్శకుడు శివ రూపొందిస్తున్నారు. పాన్ వరల్డ్ మూవీగా మొత్తం 10 భాషల్లో తెరకెక్కుతున్న 'కంగువ' త్రీడీలోనూ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాలో ఉధిరన్ అనే క్యారెక్టర్‌ను బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ నటిస్తున్నారు. శనివారం బాబీ డియోల్ 55వ పుట్టిన రోజు. ఈ సందర్భంగా 'కంగువ' చిత్రం నుంచి ఉధిరన్ లుక్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో బాబీ డియోల్ ఉధిరన్‌గా యూనిక్ మేకోవర్‌లో కనిపిస్తున్నారు. త్వరలో థియేటర్లలోకి రానున్న ఈ చిత్రానికి కథ: శివ, ఆదినారాయణ, నిర్మాతలు: కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్, దర్శకత్వం: శివ.

నటన బహుముఖం

హర్షిత్ కార్తీక్ ప్రధాన పాత్రలో నటిస్తూ స్వీయ నిర్మాణ దర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రం 'బహుముఖం'. 'గుడ్ బ్యాడ్ యాక్టర్' ఉపశీర్షిక. శనివారం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఇందులో ఓ వైపు శివుడి రూపంలో, మరోవైపు సాధారణ వ్యక్తిగా హీరో కనిపిస్తున్నాడు. అతని చేతులకు సంకెళ్లు వేశారు. ఫస్ట్‌లుక్ పోస్టర్ హీరో పాత్ర తాలూకు స్వభావాన్ని తెలియజేసేలా ఉంది. సస్పెన్స్, థ్రిల్లింగ్ అంశాలు కలబోసిన చిత్రమిదని.. అమెరికాలో చిత్రీకరణ జరిపామని హీరో హర్షిత్ కార్తీక్ తెలిపారు. త్వరలో థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమాకు కెమెరా: ల్యూక్ ఫ్లెచర్, సంగీతం: ఫణి కల్యాణ్, సంభాషణలు: రామస్వామి, హర్షిత్ కార్తీక్, రచన, నిర్మాణం, దర్శకత్వం: హర్షిత్ కార్తీక్.

రియలిస్టిక్ కథతో 'గేమ్ ఆన్'

'గేమ్ ఆన్' చిత్రం రియలిస్టిక్‌గా ఉంటుందని, సైకలాజికల్ థ్రిల్లర్‌గా ప్రేక్షకులకు కొత్త అనుభూతినందిస్తుందని చెప్పారు దర్శకుడు దయానంద్. ఆయన నిర్దేశకత్వంలో గీతానంద్, నేహా సోలంకి జంటగా నటించిన ఈ చిత్రం ఫిబ్రవరి 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో దర్శకుడు దయానంద్ మాట్లాడుతూ 'పాఠశాల రోజుల నుంచే నాకు సినిమాల మీద ఆసక్తి ఉంది. హ్యాపీడేస్, ఏ మాయ చేసావే సినిమాలు చూసిన తర్వాత దర్శకత్వం మీద అభిరుచి ఏర్పడింది. చనిపోదామనుకున్న వ్యక్తి అనుకోకుండా ఓ గేమ్ ఆడాల్సి వస్తే అతని జీవితం ఎలాంటి మలుపులు తిరిగిందన్నదే ఈ చిత్ర కథాంశం. తొమ్మిది టాస్కులు దాటుకుంటూ వెళ్లిన అతను చివరకు ఎలాంటి ఫలితం పొందాడన్నది ఆసక్తికరంగా ఉంటుంది. మధుబాల, ఆదిత్యామీనన్ పాత్రలు కీలంగా ఉంటాయి. హీరో గీతానంద్ పాత్రలో చాలా షేడ్స్ కనిపిస్తాయి. కథానాయిక నేహా సోలంకి పాత్రలో చాలా సర్‌ప్రైజ్‌లుంటాయి. సైకలాజికల్ కాన్సెప్ట్‌తో రియలిస్టిక్‌గా ఈ సినిమాను తెరకెక్కించాం. యువతతో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్‌కు కూడా నచ్చుతుంది' అన్నారు.

హీరోకు శాపం ఉంటే..

'మహాభారతం చదివినప్పుడు అందులో శాపాల నేపథ్యంలో కథల గురించి తెలుసుకున్నా. అలాంటి ఓ శాపాన్ని ఈ తరం యువకుడు ఎదుర్కొంటే ఎలా ఉంటుందనే ఆలోచన నుంచే 'హ్యాపీ ఎండింగ్' సినిమా కథ పుట్టింది' అన్నారు కౌశిక్ భీమిడి. ఆయన దర్శకత్వంలో యష్ పూరి కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో దర్శకుడు కౌశిక్ భీమిడి మాట్లాడుతూ 'దర్శకుడిగా నాకిది తొలి చిత్రం. టాలెంటెడ్ టీమ్‌తో సినిమా చేశాను. పురాణాల నేపథ్యం నుంచి తీసుకున్న కాన్సెప్ట్ కాబట్టి మేకింగ్ మాత్రం నేటి ట్రెండ్‌కు తగినట్లుగా ఉండాలనుకున్నా. అప్పుడే నేటి యూత్‌కు సినిమా రీచ్ అవుతుందనిపించింది. ఇదొక రొమాంటిక్ డ్రామా. హీరోకు శాపం వల్ల అతని జీవితం ట్రాజెడీగా అనిపిస్తుంది కానీ చూసే ఆడియెన్స్‌కు మాత్రం నవ్వు తెప్పిస్తుంది. శాపానికి గురైన యువకుడు ప్రేమలో పడితే ఎలా ఉంటుందనే అంశం చాలా కొత్తగా అనిపిస్తుంది. ఈ సినిమాలో రొమాన్స్ కూడా డిఫరెంట్‌గా ఉంటుంది. ఎక్కడా అసభ్యత లేకుండా ఫ్యామిలీ ఆడియెన్స్ చూసే విధంగా తెరకెక్కించాం. క్లైమాక్స్‌లో హీరో శాపవిముక్తుడు కావడంతో కథ సుఖాంతమవుతుంది' అన్నారు.

కౌశిక్